విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

ఆదివారం 21 సెప్టెంబరు 2025 8 పేజీలు

ఎన్నాళ్ళకెన్నాళ్లకు..!

- పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల
- ఇకపై పరిగెత్తనున్న అభివృద్ధి
- నాలుగు గ్రేడ్లుగా విభజన

విశాలాంధ్ర-కొవ్వూరు : గత వైసీపీ పాలనలో పంచాయతీ నిధులు ఇవ్వకపోవడంతో అవి నిర్వీర్యమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను సైతం విద్యుత్తు బకాయిల బిల్లులకు వైసీపీ ప్రభుత్వం మళ్ళించడంతో పంచాయతీలు అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా భావించి పరిపాలన ప్రారంభించింది. దేశ ప్రగతికి పట్టుకొమ్మలైన పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు మంజూరు అయ్యాయి. జిల్లాలో సుమారు 250 పైగా పంచాయతీలు ఉన్నాయి.

పక్కాగా లెక్కలు చూపించాలి

పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్యం, కాలువల నిర్మాణం, ఘన వ్యర్థాల కేంద్రాల నిర్వహణ, పంచాయతీ కార్మికుల వేతనాలు, తాగునీటి సరఫరా, వీధి దీపాల మరమ్మతులకు ఈ నిధులను ఖర్చు పెట్టాల్సి ఉంది. 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఖర్చు చేయాల్సి ఉంది.

నాలుగు గ్రేడ్లుగా పంచాయతీల విభజన

రాష్ట్రంలోని పంచాయతీలను నాలుగు గ్రేడులుగా విభజిస్తున్నారు. కొత్త విధానం ప్రకారం ప్రతి పంచాయతీకి కార్యదర్శి స్థాయి నుంచి ప్రతి స్థాయిలోని సిబ్బంది అందుబాటులో ఉంటారు. ప్రస్తుత క్లస్టర్ విధానంలో రెండు, మూడు పంచాయతీల బాధ్యతలు ఒక కార్యదర్శి నిర్వహిస్తున్నారు. ప్రతి పంచాయతీకి గ్రేడ్ల వారీగా కార్యదర్శులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. పంచాయతీలలో అమలు చేస్తున్న విధానాలు, లోపాలు చేయాల్సిన మార్పులపై కృషి చేస్తున్నారు. ప్రస్తుతం లోపాలు పరిపాలన వ్యవస్థలు పంచాయతీలు ప్రగతికి అవరోధాలుగా మారాయన్న ▶మిగతా 2లో..

స్వచ్ఛాంధ్ర వైపు పయనిద్దాం

కలెక్టర్ కీర్తి చేకూరి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : అధిక ఉష్ణోగ్రతలు నివారించడానికి ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని, వాటిని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక తారకరామ నగర్లో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, స్థానికులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, జిల్లాను కాలుష్యరహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్న ధృఢ సంకల్పంతో ముందుకువెళుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, వివిధ సంక్షేమ శాఖ వసతి గృహాల ఆవరణల్లో మొక్కలు నాటాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర నిర్మాణ క్రమంలో ఈ-వ్యర్థాలను (ఎలక్ట్రానిక్) సరైన రీతిలో ▶మిగతా 2లో..

'వాహన మిత్ర' గడువు పెంచాలి

విశాలాంధ్ర - కాకినాడ : ది న్యూ ఆటో రిక్షా ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కాకినాడ స్థానిక ఎస్బిఐ ఇంద్రపాలెం బ్రాంచి వద్ద ఆటో కార్మికుల స్టాండ్ వద్ద నిరసన జరిగింది. ఈ నిరసనకు ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన మిత్రదారులందరికీ వాహన పథకం దరఖాస్తు గడువు పొడిగించాలని, ఫిట్నెస్ సర్టిఫికెట్లు మంజూరు చేయడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని, సచివాలయంలో వాహన మిత్రులకు అప్లై చేయడంలో సచివాలయ సెక్రటరీలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అప్లై చేయడానికి ఆలస్యం అవుతుందని అన్నారు. కొంతమంది వాహన మిత్రులకు ఆర్సి ఉన్నా సచివాలయ లాగిన్లో ▶మిగతా 4లో..

ప్రభుత్వమే మెడికల్ కాలేజీలు నడపాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర -భీమవరం: పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేలా, వైద్య రంగాన్ని మరింత ఖరీదుగా మార్చేలా మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటోళ్ళకు అప్పగించేలా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం విరమించుకోవాలని భీమవరంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి. గోపాలన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంకా కృష్ణ మూర్తి, ఎంసీపీఐయ జిల్లా నాయకులు కె.మహంకాళి మాట్లాడుతూ వైద్య విద్య ప్రభుత్వ రంగంలోనే ఉంటే ప్రజానీకానికి, రాష్ట్రాభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. వైద్యరంగం ప్రభుత్వ రంగంలో ఉన్న అనేక దేశాల్లో వైద్య సదుపాయాలు ప్రజలకు ఎలా అందించబడుతున్నాయో, కార్పొరేట్ల పరమైతే ప్రజలకు ఎలా ఖరీదుగా మారుతుందో కరోనా సమయంలో మనందరికీ తెలిసిందేనని నాయకులు గుర్తు చేశారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పీపీపీ పద్ధతి నిర్ణయాన్ని తక్షణం విరమించుకోవాలన్నారు.

చంద్రబాబు 590 జీవో జారీ చేసి మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. దీని వలన పేద విద్యార్థి తన లక్ష్యాన్ని ఎలా చేరుకుంటారని నాయకులు ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి మల్లుల శ్రీనివాసరావు, నాయకులు నాగిడి శాంతమూర్తి, ఛాన్ భాష, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్ కుమార్, బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి ఈద శేఖర్ బాబు, మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ▶మిగతా 2లో..

పిల్లలకు బోధనపై కలెక్టర్ అసహనం

- అంగన్వాడీ సిబ్బందికి సూచనలు
- మూడు గంటలు కలెక్టర్ పర్యటన

విశాలాంధ్ర-లింగపాలెం: కలెక్టర్ వెట్రిసెల్వి లింగపాలెం మండలంలో శనివారం పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దాదాపు మూడు గంటల పాటు విరామం లేకుండా ఈమె పర్యటన సాగింది. ముందుగా లింగపాలెం పంచాయతీలోని పూనం నగర్లో అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో చదువుతున్న పిల్లల బోధనపై తనిఖీ చేశారు. పిల్లలనుంచి సరైన సమాధానాలు రాకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. వచ్చామా!వెళ్ళామా! అనేది కాకుండా పిల్లల వయస్సుకు తగ్గట్టుగా బోధన జరగాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. సింగగూడెం ఉన్నత పాఠశాలకు కలెక్టర్ వెళ్లారు. పాఠశాలలో మొక్కలు నాటారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యా యులు, అధికారులు, ప్రజలతో స్వచ్ఛ్ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ పచ్చదనం, పరిశుభ్రతపై ప్రాముఖ్యత తెలుసుకొని అనుసరించాలని కలెక్టర్ ▶మిగతా 2లో..

సముద్ర తీర ప్రాంత సమతుల్యతకు

బాధ్యతగా మెలగాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపు

విశాలాంధ్ర-నరసాపురం: సెప్టెంబర్ 20న అంతర్జాతీయ తీరప్రాంత శుభ్రపరిచే దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్లో బీచ్ క్లీనింగ్ క్యాంపెయిన్ లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. విద్యా ర్థులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, డ్వాక్రా, మెప్మా మహిళలు, పరిశ్రమల ప్రతినిధులు, అధికారులు, తదితరులతో కలిసి బీచ్ క్లీనింగ్లో జిల్లా కలెక్టర్ పాల్గొని ఉత్సాహ పరిచారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. బీచ్ ప్రాంతాన్ని శుభ్రపరి చేందుకు పెద్ద ఎత్తున విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల అధికారులు పోటీ పడటంతో బీచ్ ప్రాంతం అంతా కోలాహలంగా పండుగ ▶మిగతా 2లో..

కోమర్రు మాజీ సర్పంచ్ ఆకస్మిక మృతి

విశాలాంధ్ర-ముదినేపల్లి : ముదినేపల్లి మండలం కోమర్రు గ్రామ మాజీ సర్పంచ్ కొల్లి వెంకట సత్యనారాయణ (60) ఆకస్మిక మృతి చెందారు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కోమర్రు గ్రామానికి ఒకసారి సర్పంచిగా, మరో మారు ఉప సర్పంచిగా పని చేశారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో కొంతకాలంగా చికిత్స పొందుతూ మరణించారు. మరణ వార్త విన్న ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైసీపీ నాయకులు దూలం వినయ్ కుమార్ పలువురు కార్యకర్తలు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆక్వా సాగు రైతుగా మండలంలో సత్యనారాయణ సుపరిచితులు.

వడాలిలో పారిశుద్ధ్య పరిరక్షణ చర్యలు

విశాలాంధ్ర-ముదినేపల్లి : సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో పారిశుద్ధ్య పరిరక్షణ, పర్యావరణ స్థిరత్వం లక్ష్యంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వడాలిలో చెత్త నుండి సంపద కేంద్రంలో మొక్కలు నాటారు. పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి వై.శ్యాంసుందర్, నాయకులు నక్క అప్పారావు, జోగి సుబ్రహ్మణ్యం, గొర్రెల అర్జునరావు, వీరమల్లు శేషు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్నిరంగాల్లో ముందుండాలి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : ఆడపిల్లలు చదువులతో పాటు, అన్ని రంగాలలో ముందుండాలని బయ్యనగూడెం ప్రభుత్వాసుపత్రి ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్. సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలో బయ్యన్నగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బేటి బచావో-బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లల పట్ల లింగ వివక్షత చూపవద్దని, ఆడ, మగ, ఇద్దరు సమానమేనని ఆడపిల్ల లేకపోతే సంతానమే ఉండదని , మానవజాతి కనుమరుగయ్యే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

విశాలాంధ్ర-చింతలపూడి: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని చింతలపూడి మండల అభివృద్ధి అధికారి పి.కామేశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా చింతలపూడి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో కామేశ్వరి, ఎంపీపీ రాంబాబులు మొక్కలు నాటారు. ఈ కార్యక్ర మంలో ఎంఈఓలు రామారావు, కిరణ్, ఏవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు

(1వ పేజీ తరువాయి)

విమర్శలు ఉన్నాయి. ఇక గ్రేడ్ల విషయానికొస్తే గతంలో పంచాయతీలకు వచ్చే ఆదాయం కొలమానంగా తీసుకుని అమలు చేసేవారు. ప్రస్తుతం జనాభా, మండల కేంద్రం, గిరిజన, గిరిజనేతర, ఇతర ప్రాంతాల ఆదాయం అనే అంశాలను విశ్లేషించుకుని నాలుగు గ్రేడులుగా విభజించబోతున్నారు.

బాధ్యతగా మెలగాలి

(1వ పేజీ తరువాయి)

వాతావరణాన్ని తలపించింది. అందరూ చేయి చేయి కలిపి గోనెసంచెలు, మేదర బుట్టలలోనికి చెత్తను సేకరించి ట్రాక్టర్లలో డంప్ చేయడం విద్యార్థులకు పర్యావరణం పట్ల స్ఫూర్తిదాయకంగా నిలిచింది అనడంలో సందేహం లేదు.

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ చిన్ననాటి నుండే విద్యార్థులకు పర్యావరణం పట్ల అవగాహన కల్పించడం ద్వారా కాలుష్య నియంత్రణకు ముందడుగు వేయడమే అన్నారు. మానవ మనుగడకే ముప్పు వాటిల్లేల పర్యావరణాన్ని కొన్ని చర్యలు దెబ్బతిస్తున్నాయని, దీని కారణంగా అనేక మొక్కలు, జంతువులు అంతరించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్లీనింగ్ కార్యక్రమం ఒక్కరోజుతో పరిమితం కాకుండా ప్రతిరోజు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని మానివేయడం, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించడం, స్థిరమైన ఆహార అలవాట్లను ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా తాటి వనాలను పెంచే సంకల్పంతో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, స్థానిక శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ సముద్రం తీరం వెంబడి తాటి విత్తనాలను నాటారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఆర్డీవో దాసిరాజు, డి.ఎస్.పి డాక్టర్ శ్రీ వేద, జిల్లా నోడల్ అధికారి, భీమవరం డి ఎల్ డి ఓ వై.దోసి రెడ్డి, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇ.వెంకటేశ్వర్లు, డిపిఓ ఎం.రామ్ నాథ్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అసహనం (1వ పేజీ తరువాయి)

కోరారు. డంపింగ్ యార్డులో తయారుచేసిన సేంద్రియ ఎరువులను రైతులకు పంపిణీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి వీరిని సన్మానించారు. చెత్తను తరలించేటప్పుడు వినియోగించుకునేందుకు కిట్లలను అందజేశారు. కళ్యాణంపాడులో డ్రోను వినియోగాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయాన్ని సులభతరం చేసేందుకు ప్రభుత్వం సబ్సిడీపై అధునాతన పరికరాలను ఇస్తుందని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మేజర్ పంచాయతీ ధర్మాజీగూడెంలో బస్టాండ్ ఆక్రమణకు గురవ్వటం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ ఆక్రమణలు తొలగించాలని బీజేపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు.

ఈసమస్యతో పాటు ధర్మాజీగూడెంలోని మల్లసముద్రం చెరువును ఆక్రమించుకున్నారని చెరువు ఆక్రమణలు తొలగించే చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు కోరారు. ఈ సమస్యపై తగు చర్యలు తీసుకుంటామని ఈమె హామీ ఇచ్చారు. కలెక్టర్ పర్యటనలో మండల స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ పర్యటనలో నూజివీడు రెవిన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ వినూత్న, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్ భాష, డిపిఓ అనురాధ, వ్యవసాయశాఖ ఏడిఏ సుబ్బారావు, డీఎల్డీవో వెంకటరత్నం, తహసీల్దార్ నజీముల్లాషా అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

నడపాలి (1వ పేజీ తరువాయి)

ఎస్. శ్రీనివాస్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గాతల జేమ్స్, ఏపీ సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పెండ్ర వీరన్న, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్, ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మత్తె రాజ్ కుమార్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అధ్యక్షుడు నూడదాసు గంగయ్య, జక్కంశెట్టి సత్యనారాయణ, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, ఐలు జిల్లా నాయకులు రామాని కాన్స్టో, రిటైర్డ్ మెడికల్ అండ్ హెల్త్ అధికారి బివిఎస్ ప్రసాద్, రిటైర్డ్ ఎమ్మార్వో బి.ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీపీఎల్ జిల్లా అధ్యక్షులు కాకర రాజ్‌కుమార్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి. వాసుదేవరావు, జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు, పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, రైతు సంఘం జిల్లా నాయకులు చల్లబోయిన వెంకటేశ్వరరావు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య ప్రసాద్, షేక్ వలి, తదితరులు పాల్గొన్నారు.

పయనిద్దాం

(1వ పేజీ తరువాయి)

తొలగించకపోతే వాటి నుంచి వెలువడే లెడ్ వంటి రసాయనాలు ప్రజలకు ఎంతో ప్రమాదకరంగా పరిణమిస్తాయన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగించే ప్రతిఒక్కరూ రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్ అనే మూడు విషయాలను గుర్తుంచుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కలు నాటడాన్ని ప్రతీ పౌరుడు తన సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. మానవాళి మనుగడ పచ్చదనం పరిఢవిల్లితేనే సాధ్యమవుతుందన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గ్రహించాలన్నారు. కార్యక్రమంలో నగర అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎంహెచ్ఓ వినూత్న, ఏడిహెచ్ పి. అనిత కుమారి, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం- పచ్చదనాన్ని పెంపొందిద్దాం

విశాలాంధ్ర- ఉంగుటూరు : మొక్కలు నాటుదాం పచ్చదనాన్ని పెంచుతామని ఉంగుటూరు ఎంపీడీవో గంజి రాజు మనోజ్ అన్నారు. ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామంలో శనివారం జరిగే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి సర్పంచ్ దిద్ద అలకనంద అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని తద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామస్తులు మొక్కలు పెంచు కోవడానికి మొక్కల్ని ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించి కావలసిన మొక్కలు అడిగి వాటిని ప్రత్యేక శ్రద్ధతో ప్రతి ఇంటి దగ్గర ఒక మొక్క ఉండేలాగా ఆ మొక్కను దత్తత తీసుకుని పెంచాలని ఆయన కోరారు అనంతరం నారాయణపురం రెండవ సచివాలయం ప్రాంగణంలో సర్పంచ్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్త్రీలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యం

విశాలాంధ్ర- చింతలపూడి: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని మాజీ జెడ్పీటీసీ తాళ్లూరి రాధారాణి అన్నారు. చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ఎర్రగుంటపల్లి, ఊట సముద్రం సచివాలయం పరిధిలో శనివారం స్వస్థనారి స్వసక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, పోషణ అభియాన్, తల్లి బిడ్డల సేవలు, వయోవృద్ధుల ఆరోగ్య పరీక్షలు, కిశోర బాలబాలికల ఆరోగ్య పరీక్షలు ,క్షయ వ్యాధి స్క్రీనింగ్, మానసిక వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.నరేష్, డాక్టర్ గీత స్పెషలిస్ట్ డాక్టర్ హరీశ్, పిల్లల వైద్యులు చింతలపూడి సాయిస్ఫూర్తి హాస్పటల్ నుంచి ఎం. సాల్మన్‌రాజు, డెంటల్ డాక్టర్లు పాల్గొని రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎర్రగుంటపల్లి గ్రామ సర్పంచ్ తొలెమెల్లి రాణి, మాజీ జెడ్పీటీసీ తాళ్లూరు రాధా రాణి, వైస్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి,అలవాల శంకర్ రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హరిత వెలుగులతో పర్యావరణాన్ని కాపాడుకోవాలి

విశాలాంధ్ర-చింతలపూడి: హరిత వెలుగులతో పర్యావరణాన్ని కాపాడుదాం అని చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి. శ్రీనివాసరావు అన్నారు. చింతలపూడి పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహించే మూడో శనివారం కార్యక్రమం ఈసారి "హరిత ఆంధ్రప్రదేశ్" థీమ్‌తో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పరిసరా లను పరిశు భ్రపరిచి, కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటితేనే పచ్చని ఆంధ్ర సాధ్యం అవుతుంది అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ యన్‌జెకె నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ సాధనలో విద్యార్థుల పాత్ర ముఖ్యమైందని అన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అధ్యాపకు లకు, విద్యార్థులకు కమిటీ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎ.వి.ఆర్, లెఫ్టినెంట్ జి.జై. మౌనిక ధన్యవాదాలు తెలియజేశారు.

క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు

విశాలాంధ్ర -భీమవరం: క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఆరోగ్యకరమైన జీవన శైలితో, ప్రభుత్వం అందిస్తున్న వైద్యాన్ని సద్వినియోగం చేసుకుని సాధారణ జీవితాన్ని అందుకోవాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం ఏరియా ఆసుపత్రిలో

శనివారం స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ రోగులకు మెడికల్ కిట్లు బలవర్ధక ఆహారం అందచేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షయ వ్యాధిని తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే రోగులకు నిర్వహించే వైద్య పరీక్షలు, వైద్యం, నిక్షేమిత్ర పథకం వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని వారికి ప్రతి నెల 600 రూపాయలు విలువ గల పౌష్టికాహారం ఆరు నెలల పాటు అందించే కార్యక్రమం నిక్షేమిత్రా అమలు చేస్తున్నామని జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ కే.జే.ఎన్.రవికుమార్ ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో డిపిసి ఆర్.విద్యానంద్, డి.పి. ఎస్.పి.సత్యనారాయణ, ఎస్ టి ఎస్ ఎస్ ఆర్ ప్రసాద్, జనసేన నాయకులు బండి రమేష్ కుమార్, చెనమల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్జీమర్స్ డే

విశాలాంధ్ర -భీమవరం: ఆరోగ్య సంస్థల నివేదిక ప్రకారం ప్రతి 7 సెకన్లకు ఒకరు అల్జీమర్స్ వ్యాధి బారిన పడుతున్నారని, ప్రతి రోజూ 50 మందికి పైగా వైద్యం అందుకుంటున్నారని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ జీవీ రమణరావు అన్నారు. శాంతి నర్సింగ్ హోమ్‌లో సైక్రియాటిక్ సొసైటీ భీమవరం శాఖ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ అల్జీమర్స్ డే నిర్వహించారు. ఈ

సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయసు పెరిగే కొద్ది వచ్చే అల్జీమర్స్ వ్యాధి సోకిన వారు తమ పేరు మర్చిపోతారని, ఈ వ్యాధి ఎక్కువగా 60 ఏళ్లు దాటిన వారిలో వస్తోందని, నేడు 45 ఏళ్ల వారిలో కూడా వ్యాధి లక్షణాలు కనిపించటం ఆందోళన కలిగిస్తోందన్నారు. డాక్టర్ సుభాష్, డాక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ సుమారు 8.8 మిలియన్ల మంది వ్యాధితో బాధపడుతున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయని, ఈ వ్యాధి సోకిన వారు వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'అక్షర ఆంధ్ర' విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ జిసిహెచ్ ప్రభాకర్ తెలిపారు. టి నరసాపురంలోని మూడు అక్షర ఆంధ్ర కేంద్రాలను శనివారం సందర్శించి అభ్యాసకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన మహిళలను, ఉపాధి హామీ పథకంలోని పురుషులను అక్షరాస్యులుగా చేయడమే అక్షరాంధ్ర కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ ఆర్.విజయ కుమార్ మాట్లాడుతూ అక్షరాంధ్ర కార్యక్రమంలో క్రియాత్మక విద్య, ఆర్థిక విద్య, డిజిటల్ విద్యలను ప్రతి ఒక్కరు నేర్చుకుని నేటి తరంతో పోటీ పడాలని తెలిపారు. మండలంలో 2400 మంది డ్వాక్రా మహిళలను, 1000 మంది ఉపాధి హామీ పథకంలోని పురుషులను అక్షరాస్యులుగా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వలంటరీ టీచర్స్, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత

మంత్రి పార్థసారథి

విశాలాంధ్ర- నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు గతం కన్నా తగ్గాయని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా నూజివీడు పట్టణ ఉర్దూ పాఠశాల ప్రాంగణంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం భాగంగా విద్యార్థులచే మొక్కలు పాటించి ప్రతిజ్ఞ చేయించిన రాష్ట్ర మంత్రి పార్థసారధి మాట్లాడుతూ వ్యాధులకు మూలం అపరిశుభ్ర వాతావరణమన్నారు. ప్రజలంతా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించకపోవడం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా 25 వేల కోట్ల రూపాయలకు పైగా ప్రజారోగ్య పరిరక్షణకు ఖర్చు చేస్తుందన్నారు. వ్యాధుల మూలంగా ప్రజలు ఆర్థికంగా నష్టపోవడమే కాక, శారీరకంగా కూడా బలహీనులవుతారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాధులు వచ్చిన తరవాత చికిత్స కన్నా వ్యాధులు రాకుండా నివారణకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. నూజివీడు పట్టణంలో శానిటేషన్ కోసం త్వరలో యంత్రాలు కొనుగోలు మిషన్లతో వీధుల శుభ్రం చేస్తామన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థుల పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యతలను మంత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ బి. వినూత్న, తహసీల్దార్ భద్రు, పాఠశాల విద్యార్థులు, స్థానిక ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ప్రజారోగ్యం మెరుగు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో ప్రజారోగ్యం మెరుగుపడుతుందని డి ఎల్ డి ఓ రాజు పేర్కొన్నారు. మండలంలోని పొంగుటూరు గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని, మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చు అన్నారు. తడి చెత్త పొడి చెత్తను వేరువేరుగా ఉంచి పంచాయతీ సిబ్బంది వచ్చినప్పుడు వారికి అంద చేయాలని , పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కొల్లూరి సత్తిబాబు గ్రామంలో 50 కుటుంబాలకు చెత్త సేకరణ చేసే ప్లాస్టిక్ టబ్బులను పంపిణీ చేశారు. క్లాప్ మిత్రులు చేస్తున్న సేవలకు గాను వారిని ప్రత్యేకంగా సన్మానం చేసి దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటి, గ్రామంలో పరిసరాల పరిశుభ్రతకై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ ఏవి సుబ్బారాయన్, తహసీల్దార్ నాగరాజు, ఎంఈఓ సురేష్ బాబు, గ్రామపంచాయతీ సర్పంచ్ పసుపులేటి రాంబాబు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి దైవంతో సమానం

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు ప్రసాద్‌ను సన్మానించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర -ఏలూరు : పాఠశాల స్థాయిలో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది బాల్యం నుండి ఉత్తమ భవిష్యత్తుకు పునాదులు వేసే ఉపాధ్యాయ వృత్తి దైవంతో సమానమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య అన్నారు. 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులలో ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు కైవసం చేసుకున్న ఏలూరు రూరల్ మండలం మానూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తన చిన్ననాటి మిత్రుడు తేరా ప్రసాద్‌ను బడేటి రాధాకృష్ణయ్య కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి మాట్లాడుతూ పిల్లలకు ప్రాథమికంగా యోగ్యత కలిగిన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. దేశం అభివృద్ధిపథంలో పయనించేందుకు, శాస్త్రసాంకేతిక రంగాలలో విజయానికి నాణ్యమైన విద్య ఎంత కీలకమన్నారు. ప్రపంచ పరిణామాలను పరిస్థితులకు అన్వయించి భవిష్యత్ కాలానికి అనుగుణమైన నిర్ణయాలకు నాంది పలికించే కర్త ఉపాధ్యాయుడేనని ఎమ్మెల్యే బడేటి చంటి వ్యాఖ్యానించారు. తనతో కలసి విద్యాభ్యాసం చేసి ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులను ఉన్నత స్థానాలకు తీసుకువెళ్లిన ప్రసాద్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీద అవార్డు పొందడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టి శ్రీరాం ప్రసాద్, ఆంధ్ర శ్రీనివాస్, యుటిఎఫ్ ఏలూరు జిల్లా ఆడిట్ కన్వీనర్ బంటు మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్నాం...సాయ పడండి

కలెక్టర్‌ను వేడుకున్న బాలిక

విశాలాంధ్ర-లింగపాలెం: ముగ్గురు కూతుళ్లను, అమ్మను వదిలేసి మా నాన్న వెళ్ళిపోయాడని ఆడపిల్లలమైన తమను పెంచటానికి అమ్మ అష్ట కష్టాలు పడుతుందని మా అమ్మకు ఉపాధి అవకాశాలు చూపించాలంటూ సింగుగూడెం పాఠశాలలో

ఎనిమిదో తరగతి చదువుతున్న ఝాన్సీ కలెక్టరును వేడుకుంది. సింగుగూడెం పాఠశాలకు వచ్చిన కలెక్టర్కు ఝాన్సీ ఒక్కసారిగా తమ కుటుంబ పరిస్థితిని వివరించింది.దీంతో కలెక్టర్ తో పాటు,కలెక్టర్ తో ఉన్నవారంతా వారంతా అయ్యో!అంటూ నిట్టూర్పు విడిచారు. ఈ పాప తమకుటుంబానికి వచ్చిన కష్టాన్ని ధైర్యంగా కలెక్టర్కు వివరించింది. కలెక్టర్ ఈ బాలిక చెప్పేవన్నీ శ్రద్ధగా విన్నారు. ఉపాధ్యాయులు ఈ బాలిక బాగా చదువుతుందని కుటుంబ సమస్య లతో బాధపడుతుందని కలెక్టర్కు వివరించారు. సమస్య విన్న కలెక్టర్ బాలిక తల్లికి ఉపాధి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. బాగా చదువుతున్న నువ్వు ఏ ఉద్యోగం చేయాలని ఉందంటూ కలెక్టర్ ప్రశ్నించగా తాను ఐపీఎస్ అవ్వాలను కుంటున్నానని కలెక్టర్కు చెప్పింది. బాలిక సమాధానం కలెక్టర్కు ఆనందాన్ని కలిగించింది. బాధలలో ఉన్న ఈ కుటుంబాన్ని ఆదుకుంటానని కలెక్టర్ హామీ ఇవ్వటంతో అక్కడ ఉన్న వారంతా కలెక్టర్ ఔదార్యాన్ని కొనియాడారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

విశాలాంధ్ర -భీమవరం: కాలుష్య కోరల నుంచి భావితరాలను రక్షించాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆర్.ఆర్.డి.ఎస్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె.ప్రసూన విద్యార్థులకు పిలుపునిచ్చారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ వేడు కల్లో భాగంగా కళాశాల ఆవర ణలో విద్యార్థులు మొక్కలు నాటి పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి

వృక్షం మనకు తల్లి వంటిదని, మొక్కలు నాటాక వాటి సంరక్షణకు విద్యార్థులు బాధ్యత వహించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో భూతాపం అనూహ్యంగా పెరిగి జనం పిట్టల్లా రాలిపోయే సమయం ఆసన్నమైందని హెచ్చరించారు. ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ పి.అరవింద స్వామి మాట్లాడుతూ మొక్కలు పెంచడం పర్యావరణహితమైన కార్యక్రమమే కాకుండా మానవుని సంక్షేమా నికి మంచిది అన్నారు. అధ్యాపకులు ఎల్.నరసింహారావు, జి.ఉమా మహేశ్వరి, జి.ప్రసాద్ బాబు, అధ్యాపకేతర సిబ్బంది ఇ.సత్య నారాయణ, కే.రామకృష్ణ, జి.రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో వేండ్ర పాఠశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - పాలకోడేరు : జిల్లాస్థాయిలో బాలికా సంరక్షణ అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన చిత్ర లేఖనం పోటీల్లో పాలకోడేరు మండలం వేండ్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వేండ్ర దీపిక ప్రథమస్థానం సాధించింది. వారధి ఇండియా ఫౌండేషన్ వార్షిక వ్యాచరచన జిల్లా స్థాయి పోటీలలో సింగంశెట్టి యురేక, వసము కృతిక బృందం జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో

ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థినిలు మాట్లాడుతూ తమ గురువుల చక్కని తర్ఫీదు వల్ల జిల్లా స్థాయిలలో ప్రథమస్థానంలో నిలిచామని, భవిష్యత్తులో రాష్ట్రస్థాయిలో మరిన్ని బహుమతులు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి.వి.శ్రీనివాస్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పాలవెంకట చలపతి, పాఠశాల విద్యాకమిటీ సభ్యులు కడలి వెంకట ఫణికుమారి, పాఠశాల ఉపాధ్యాయులు ఎం. వెంకటరమణ, సి.హెచ్. రాధ, ఆంజనేయులు తదితరులు అభినందించగా ప్రత్యేకంగా తెలుగు ఉపాధ్యాయులు పంపన సాయిబాబు పుస్తకాలు బహుకరించారు.

24న పాలకొల్లులో సీఎం పర్యటన

హెలిప్యాడ్‌ను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: ఈ నెల 24న పాలకొల్లులో జరిగే రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కుమార్తె వివాహ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరయ్యేందుకు బ్రాడీపేట బైపాస్ రోడ్‌లో సిద్ధం చేస్తున్న హెలిప్యాడ్ ను కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించి, హెలిప్యాడ్ ప్రాంతం మ్యాప్ ను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. హెలిప్యాడ్ నిర్మాణం అత్యంత పకడ్బందీగా చేపట్టాలని ఆర్‌అండ్‌బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బారికేడింగ్, ఐరన్ మెస్ ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం రామచంద్ర గార్డెన్స్ వెనుక లేఅవుట్‌లో ఏర్పాటు చేస్తున్న కళ్యాణ వేదిక ప్రాంతాన్ని, మ్యాప్‌ను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంలో నరసాపురం ఆర్డీవో దాసిరాజు, డి.ఎస్.పి డాక్టర్ శ్రీ వేద, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, డిపిఓ ఎం. రామ్ నాథ్ రెడ్డి, తహసీల్దార్ వై.దుర్గా కిషోర్, ఆర్ అండ్ బి అధికారులు, తదితరులు ఉన్నారు.

రహదారిని నాణ్యతతో నిర్మించాలని అడిగినందుకు బెదిరింపులు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : రహదారిని నాణ్యతతో నిర్మించాలని కాంట్రాక్టరును కోరినందుకు కాంట్రాక్టరు తమ్ముడు తనను మానసికంగా హింసిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని కన్నాయి గూడెంకు చెందిన వరప్రసాద్ వాపోయారు. కొయ్యలగూడెంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో పరింపూడి గ్రామం నుండి కన్నాయిగూడెం గ్రామం వరకు రహదారి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం మట్టి రోడ్డు ఉండడంతో రైతులు నడిచి వెళ్లే పొలాలకు రహదారి నిర్మించాలని తలపెట్టి ఇటీవల ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు సుమారు 70 లక్షల రూపాయలతో గ్రావెల్ రోడ్డును నిర్మించారని తెలిపారు. రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టరును రోడ్డు నాణ్యతతో నిర్మించాలని తాను కోరగా, కాంట్రాక్టర్ తమ్ముడు తనపై బెదిరింపులకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. ఇటీవల కాంట్రాక్టర్ తమ్ముడు తనపై కర్ర విసిరి పారిపోయాడని, తనకు ప్రాణహాని కూడా ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. నాణ్యతతో రోడ్డు నిర్మించేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలని ప్రసాద్ పేర్కొన్నారు.

న్యాయస్థానాల్లో ముద్దాయిలకు శిక్ష పడాలి

ఎస్పీ కిషోర్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : నేరం చేసిన నిందితుడికి న్యాయస్థానాల్లో శిక్ష పడేలా కోర్టు మానిటరింగ్ సెల్ కృషి చేయాలని ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశించారు. శనివారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో కోర్టు మానిటరింగ్ సభ్యులతో సమీక్ష సమావేశాన్ని జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్య చంద్రరావుతో కలిసి నిర్వహించారు. ఈ సమావేశంలో ఏలూరు, జంగారెడ్డి గూడెం, నూజివీడు, పోలవరం సబ్ డివిజన్ లకు చెందిన కోర్టు మానిటరింగ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ కేసుల విచారణ వేగంగా జరగాలంటే సాక్షులను సమయానికి హాజరు చేయడం అనివార్యమని సూచించారు. ముద్దాయి లకు శిక్షలు పడేలా సమర్థవంతంగా పని చేయాలని, నేరస్తులు శిక్ష తప్పించుకోకూడదని, బాధితులు న్యాయం పొందేలా ఉండాలన్నారు. ప్రతిరోజు కోర్టులో జరిగిన ప్రక్రియను డాక్యుమెంట్ చేసి స్టేషన్ అధికారి స్థాయికి నివేదించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కోర్ట్ మానిటరింగ్ సెల్ సభ్యుల విధి నిర్వహణపై ప్రతి ఒక్కరిని వ్యక్తిగతంగా విధులు గురించి, కేసుల విచారణ, సాక్షులను సకాలంలో కోర్టు ఎదుట హాజరు పరచడం, ప్రతి కోర్ట్‌లో న్యాయ విచారణలో ఉన్న కేసుల వివరాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం. సుబ్బారావు, డిసిఆర్బి సిబ్బంది, కోర్ట్ మానిటరింగ్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించండి

హైకోర్టు జడ్జి సురేష్ రెడ్డి

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి న్యాయ సహాయం అందేలా అధికారులు కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి కె.సురేష్ రెడ్డి సూచించారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను ఏలూరులోని రెవెన్యూ అతిథి గృహంలో జిల్లా ఎస్పీ కే.ప్రతాప్ శివ కిషోర్ మర్యాద పూర్వకంగా కలుసుకొని పూల మొక్కను అందజేశారు. అనంతరం జిల్లాలోని శాంతిభద్రతలపై కొద్దిసేపు చర్చించారు. శాంతి భద్రతల పటిష్టతకు సరైన ప్రణాళికతో ముందుకు సాగాలని జడ్జి సురేష్ రెడ్డి ఎస్పీకి సూచించారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి, మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం.రామ కృష్ణంరాజు, రెండవ అదనపు జిల్లా జడ్జి ఇందిరా ప్రియదర్శిని, ఐదవ అదనపు జిల్లా జడ్జి ఆర్విఎస్. మురళీకృష్ణ, ఏడవ అదనపు జిల్లా జడ్జి వై.శ్రీనివాసరావు, ఎనిమిదవ అదనపు జిల్లా జడ్జి ఐ.శ్రీనివాస మూర్తి, ఫోక్సో స్పెషల్ జడ్జి కె.వాణిశ్రీ, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారి, జిల్లాలోని ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు.

'స్వచ్ఛత హిసేవ' విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-భీమడోలు: అందరి భాగస్వామ్యంతో 'స్వచ్ఛతా హిసేవ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భీమడోలు ఎంపీడీఓ పద్మావతిదేవి పిలుపునిచ్చారు. శనివారం భీమడోలు పంచాయతీ కార్యాలయంలో తహశీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ పద్మావతిదేవి మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కోసం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తనూజ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు సన్నద్ధం కావాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి జూడాల వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సుమారు 25 మంది విద్యార్థులకు ఎన్ ఎం ఎం ఎస్ ప్రవేశ పరీక్షకు కావలసిన విద్యాసామగ్రిని పాఠశాల పూర్వ విద్యార్థి జూడాల వెంకటేశ్వరరావు శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిక కార్యక్రమాన్ని అందరూ సాధించి, భవిష్యత్తు విద్యా కార్యక్రమాలకు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహ్మద్ అలీ, ఎస్ ఎం సి చైర్మన్ రమేష్, ఉపాధ్యాయులు సౌజన్య, దీప, ఈశ్వరి, నాగ పల్లవి, గొడుగు శ్రీను, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు భారీ వర్షం

విశాలాంధ్ర-భీమడోలు: అల్పపీడన ప్రభావంతో భీమడోలు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం అతి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి విపరీతమైన ఎండతో ఇబ్బందులు పడిన ప్రజానీకానికి ఈ భారీ వర్షం వణుకుపుట్టించింది. భీమడోలు, వడ్లపట్ల, సూరప్పగూడెం, కురెళ్ల గూడెం, పూళ్ల, గుండుగొలను, ఆగడాలలంక , మండలం లోని అన్ని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.ఈ భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పాఠశాలలు విడిచి పెట్టే సమయం కాబట్టి విద్యార్థులు తీవ్రఇబ్బందులకు గురయ్యారు.

గడువు పెంచాలి (1వ పేజీ తరువాయి)

చూపించడం లేదని, 300 యూనిట్లు కరెంట్ బిల్లు దాటిన వారికి ఈ పథకం వర్తించదని, పథకాలు ఎగ్గొట్టేందుకే కుంటి సాకులు చెబుతూ ఆంక్షలు విధిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కుంటి సాకులు మానుకొని అర్హులైన ప్రతి ఒక్క వాహన మిత్రదారులందరికీ వాహన మిత్ర పథకం అందేలా చొరవ చూపాలని, వాహన మిత్ర పథకం 20వేల రూపాయలు అందించా లని ఆయన అన్నారు. ఆటోలో సుమారుగా ఆరుగురు మాత్రమే ప్రయాణించాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని ఆంక్షలు విధిస్తున్న ఈ ట్రాఫిక్ పోలీస్ వారికి, ఆర్టీవో అధికారులకు పరిమితికి మించిన ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణి స్తుంటే కనిపించడం లేదా, రూల్స్ ప్రభుత్వ బస్సులకు వర్తించవా అని ప్రశ్నించారు. మహిళలకు ప్రత్యేకంగా ఉచితంగా కొత్త బస్సులు ఏర్పాటు చేయాలని, ఉచిత బస్సుల సమయ వేళలను నిర్ణయించా లని తద్వారా విద్యార్థులకు మేలు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పి.శ్యామ్, ఏసు, కెసిహెచ్ నాగేశ్వరరావు, కె.జోగి రాజు, టి.సుధాకర్, ఎ.శామ్యూల్, ఎం. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వారోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర -భీమవరం: కెజిఆర్ఎల్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వారోత్సవాలు శనివారం ప్రారంభించారు. కళాశాల కార్యదర్శి మెంటె రామ్‌మనోహర్ మాట్లాడుతూ నిర్దిష్టమైన జీవిత ప్రమాణాలు ఉండాలంటే ప్రతి విద్యార్థి ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీని అనుసరించాలని, జాతీయ భావాలు, దేశభక్తి యువతలో రావాలని మహాత్మాగాంధీ స్ఫూర్తితో ఎన్ఎస్ఎస్ ఏర్పడిం దని అన్నారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ద్వారా ఎన్నో ఉద్యోగావకాశాలను పొందవచ్చునని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐ.రామచంద్ర మూర్తి, పిజి డైరెక్టర్ డాక్టర్ తోట రామ్మూర్తి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.గంగాధర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను కూడా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో నిర్వహిస్తూ ఉంటారని, మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన, పర్యావరణ పరిరక్షణ తదితర కార్యక్రమాలను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో అన్ని కళాశాలలో నిర్వహిస్తామని అన్నారు. అనంతరం కళాశాలలో 200 మొక్కలను నాటారు. దేశ భక్తి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ మురళి మోహన్, సుధాకర్ విద్యార్థులు పాల్గొన్నారు.

సకాలంలో డ్రైన్ పూడిక తీత పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర - నరసాపురం : సకాలంలో డ్రైన్ పూడిక తీత పనులు పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలం లోని ఎల్‌బిచర్లలో చేపట్టిన దర్బరేవు డ్రెయిన్ పూడిక తీత పనులను శనివారం పరిశీలించి మాట్లాడారు. డ్రెయిన్‌లో మట్టి తొలగింపు పనులు పూర్తయితే ముంపు సమస్య తీరుతుందన్నారు. పంటలు ముంపు బారిన పడకుండా ఉంటాయన్నారు. రైతులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికరణపై శిక్షణ తరగతులు

విశాలాంధ్ర- పాలకోడేరు : మండల స్థాయిలో 2025-26 సంవత్సర గ్రామపంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికరణ అనే అంశాలపై స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో మండల స్థాయిలో రెండు రోజులు ఈనెల 25, 26 తేదీల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి. రెడ్డయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి ఆ రెండు రోజులలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు భీమవరం మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ముఖ్యంగా మండల పరిషత్ అధ్యక్షులు, మండలంలోని 14 మంది గ్రామ సర్పంచ్ లు, 17 మంది పంచాయతీ కార్యదర్శులు ఈ శిక్షణ తరగతులకు తప్పని సరిగా హాజరుకావలసి ఉంటుందని తెలిపారు.

మహిళలకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం కురుకురు గ్రామంలో గ్రామ హెల్త్ ఎల్‌నెస్ సెంటర్లో శనివారం దేవరపల్లి దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో స్వస్తినారి-సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి కావలసిన మందులను అందజేశారు. ఈ సందర్భంగా దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ఎస్తేరు రాణి మాట్లాడుతూ మహిళల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఏర్పాటు చేసిన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌విపి విజయ కుమార, పి విజయ కుమారి, ఎంఎల్‌హెచ్‌లు జయశ్రీ, అశ్విని, శిరీష, రాజ్ కుమార్, ఏఎన్‌ఎం పి శాంతి కుమారి, హెల్త్ స్టెంట్లు రాజు నరసింహారాజు వైద్య సిబ్బంది ఆశ అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే బీసీల అభివృద్ధి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : ‘ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్’ డైరెక్టర్ గా రాజమండ్రి రూరల్ నియోజకవర్గం నుండి నామినేట్ అయి, విజయవాడ బి.సి వెల్ఫేర్ ఆఫీసులో ప్రమాణ స్వీకారం చేసిన దాలిపర్తి వేమన, ప్రమాణ స్వీకారం అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గాల వారికి ‘బీసీ కార్పొరేషన్” ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించటమే కాకుండా, వివిధ అణగారిన కులాల వారికి ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేసి, వాటి ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేస్తూ, వృత్తిదారులకు ఆర్ధిక సహాయంతో పాటు, కుల వృత్తికి అవసరమైన పరికరాలను “ఆదరణ పథకం ద్వారా నేరుగా అందజేయాలని’ ఉద్దేశంతో అధికారులతో సర్వే నిర్వహిస్తూ ప్రభుత్వం చర్చలు జరుపుతుందన్నారు. ప్రస్తుతం కుమ్మర కుల వృత్తిదారులు ఎదుర్కొంటున్న ‘మట్టి సమస్యను’ అధికారుల దృష్టికి తీసుకురాగా, అధికారులు కుమ్మర కుల వృత్తిదారులకు మట్టిని ఇప్పించడంలో సహాయపడగలమని సానుకూలంగా స్పందించారని ఈ సందర్భంగా వేమన తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, బిజెపి నాయకులకు అందరికీ దాలిపర్తి వేమన ధన్యవాదములు తెలిపారు.

మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు

విశాలాంధ్ర - కడియం : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళల ఆరోగ్య సంరక్షణ కొరకు ఏర్పాటు చేసిన స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగపరుచుకోవాలని వైద్యాధికారి డాక్టర్ మణి జ్యోత్స్న, డాక్టర్ ఎన్ జెస్సీ సుప్రియలు కోరారు. శనివారం వేమగిరిగట్టు ప్రాథమిక పాఠశాల మరియు వీరవరం కళ్యాణ మండపంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. ఆరోగ్యకరమైన మహిళలు బలమైన కుటుంబాలు అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో మహిళలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తున్నామని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వేమగిరిలో 112 మందికి వీరవరంలో 129 మందికి వైద్యసేవలు అందించారు. వేమగిరిలో జంగా వినోద్, బొల్లాడి జాన్ బాబు, పీతల ముత్యాలరావు, సురేష్, ధర్మదాసు, నాగేశ్వరరావు, నాగబాబు, ముత్యం, శివరామకృష్ణ వీరవరంలో బత్తుల రాము,, ఎ.ఎన్.ఎంలు, ఎం.ఎల్.హెచ్.పిలు ఆశ కార్యకర్తలు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణ.. ఆందోళనవద్దు : కలెక్టర్

విశాలాంధ్ర -తాళ్లపూడి : తాళ్ళపూడి మండలం పెద్దేవం గ్రామంలో అనారోగ్యం పాలైన గేదెలలో థైలీరియాసిస్, , అంపిస్టోమియాసిస్ అనే మిశ్రమ వ్యాధులున్నట్లు పశువైద్యాధి కారులు గుర్తించారని, వ్యాధి సోకిన పశువులకు తక్షణ చికిత్స, నిరోధక ప్రోటోకాల్ అమలు చేస్తూ, మిగతా పశువులన్నింటికీ నివారణ మందులు అందజేస్తూనట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి వెల్లడించారు. గేదెలను పెంచే పాడి రైతులెవ్వరు ఆందోళన చెందవద్దని అన్నింటికీ వ్యాక్సిన్ అందిస్తామని ఆమె పేర్కొన్నారు. పెద్దేవం సంఘటనలో గేదెలుకు మిశ్రమ వ్యాధులు - డి ఏ హెచ్ వో టి. శ్రీనివాసరావు గత కొన్ని రోజులుగా తాళ్ళపూడి మండలం పెద్దేవం గ్రామంలో పశువుల మరణాలపై నిర్వహించిన వ్యాధి నిర్ధారణ పరీక్షలలో, చనిపోయిన, అనారోగ్య పశువులలో మిశ్రమ వ్యాధుల లక్షణాలు గుర్తించబడ్డాయని, తూర్పు గోదావరి జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి టి.శ్రీని వాసరావు వెల్లడించారు. సాధారణంగా థైలీరియాసిస్ వ్యాధి ఎక్కువగా సంకర జాతి పశువుల్లో కనిపిస్తుందని, కానీ గేదెలలో చాలా అరుదుగా మాత్రమే సంభవిస్తుందని, నమూనాలు సేకరించే ముందు, వ్యాధి లక్షణాల ఆధారంగా పశువులకు చికిత్స ప్రారంభించబడిందని, కొంత మెరుగుదల గమనించినట్లు, మిగతా పశువుల పరీక్షలలో వ్యాధి లక్షణాలు కనిపించ లేదన్నారు. ముందు జాగ్రత్త చర్యగా, గ్రామంలోని అన్ని ఆరోగ్య పశువులకు నివారణ మందులు అందించబడ్డాయని, వ్యాధి సోకిన పశువులను తిరిగి ఆరోగ్యవంతంగా చేయడానికి పశుసంవర్ధక శాఖ కృషి చేస్తోందని, గ్రామంలోని అన్ని పశువుల కు తమ సిబ్బంది బృందాలుగా వాక్సినేషన్ వేస్తున్నారన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి : ఎంపీపీ

విశాలాంధ్ర-దేవరపల్లి: పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయం స్వచ్ఛ్ ఆంధ్ర- స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మొక్కలు నాటారు. ఎంపీపీ దుర్గారావు మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వ కార్యాలయాలకు ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో 20 మొక్కల చొప్పున పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణాన్ని పరిరక్షించడానికి మొక్కలు నాటే కార్యక్రమాలకు ప్రోత్సహిస్తున్నారన్నారు. వృక్ష సంపదను కాపాడుకోవాలని ముఖ్యంగా మొక్కలను సంరక్షించే బాధ్యత ప్రజలు తీసుకోవాలన్నారు. ఎన్ఆర్ఈజీ పి ఏపీఓ శ్రీనివాస మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ప్రతి గ్రామంలో చెట్లు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. దేవరపల్లి పంచాయతీకి 20 మొక్కలు అందజేశామని, ఇదేవిధంగా ప్రతి గ్రామ పంచాయతీకి మొక్కలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వై రాజారావు మండల పరిషత్ సూపరిండెంట్ జి శాంతి, బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దున్న సుమన్ బాబు, పచ్చ రాంగోపాల్, దుగ్గిన ప్రసాద్ , వెలగా శ్రీనివాస్, పల్లికొండ సురేష్ కుమార్, మడతల శంకరం కుమార్, మండల పరిషత్ ఇన్చార్జి ఏఈ షాజహాన్ , సీనియర్ అసిస్టెంట్ కుసుమ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లను తక్షణమే పూర్తిచేయాలి

విశాలాంధ్ర -రాజమహేంద్ర వరం రూరల్ : రాజమహేంద్రవరం గ్రామీణ మండలంలోని పాత బొమ్మూరు గ్రామంలో శనివారం ఉదయం SASA , హౌసింగ్ డే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ నాతి బుజ్జి, ప్రత్యేక అధికారి రాజమహేంద్రవరం రూరల్ కె.ఎస్. జ్యోతి, ఎంపీడీవో ఆర్మ్ స్ట్రాంగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ హౌసింగ్ లబ్ధిదారులు కేటాయించిన ఇళ్లను తక్షణమే నిర్మాణ పనులు చేపట్టాలని, ప్రభుత్వం నిర్దేశించిన స్టేజ్ కన్వర్షన్ దశల వారీగా నిర్మాణాలు పూర్తి చేసి తదనుగుణంగా నిధులు పొందాలని సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా లబ్ధిదారుల్లో ఇళ్ల నిర్మాణ నాణ్యత, శుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రభుత్వ మార్గదర్శకాల అమలు వంటి అంశాలపై విస్తృతమైన అవగాహన కల్పించారు.

పచ్చదనం పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - సీతానగరం: పచ్చదనం పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం అని డిప్యూటీ ఎంపీడీవో మూర్తి అన్నారు. స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా నేడు పచ్చదనం ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలను నాటారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీవో మూర్తి మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర సాధ్యం అని అన్నారు. మండలంలో గల కూనవరం, చినకొండేపూడి గ్రామ పంచాయతీల పరిధిలో మండల వైద్య అధికారి డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో స్వస్త్ నారి- సశక్తి పరివార్‌లో సుమారు 400 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ప్రతి గ్రామంలో స్త్రీలకు,పిల్లలకు కాన్సర్ స్క్రీనింగ్, మధుమేహం, బీపీ, రక్తహీనత పరీక్షలు,క్షయ వ్యాధి తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : పాటంశెట్టి

విశాలాంధ్ర -గోకవరం : సమస్యల పరిష్కారంమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతానని పాఠంశెట్టి సూర్యచంద్రం పేర్కొన్నారు. శనివారం గోకవరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ -న్యాయం కోసం,సమస్యకు పరిష్కారం దొరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరిని ప్రజా సమస్యల పరిష్కార పర్యటన కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు పరిశీలించి సమస్య పరిష్కారానికి బాధితులకు తోడుగా అండగా ఉంటూ సమాజ సేవ చేయడమే ప్రధాన లక్ష్యమని పాటంశెట్టి సూర్యచంద్ర తెలిపారు. కిర్లంపూడి మండలం సోమవరం గ్రామంలో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకునే క్రమంలో అనారోగ్యంతో ఉన్న అడబాల సూర్యకాంతం కాలు తొలగించడం వల్ల మంచానికే పరిమితం అయ్యారు వికలాంగు పెన్షన్ కోసం ప్రయత్నించినా రాలేదని వారి సమస్యలు తెలిపారు సదరం సర్టిఫికెట్ ఏర్పాటు చేయించి పింఛన్ వచ్చేలా ఏర్పాటు చేస్తామని వారికి ధైర్యం చెప్పారు. భర్త అనారోగ్యంతో రెండు సంవత్సరాల క్రితం మరణించారని నేటి వరకు పింఛన్ రాకపోవడం వల్ల కుటుంబం గడవడం ఇబ్బందిగా ఉంటుందని సలాది సత్యవతి ు తమ ఆవేదన తెలిపారు అధికారులకు సమస్య వివరించి పింఛన్ వచ్చే విధంగా ఏర్పాటు చేస్తానని ధైర్యం చెప్పారు. తదితర సమస్యలు పరిష్కరిస్తామనిపాటంశెట్టి సూర్యచంద్ర భరోసా కల్పించారు.

ప్రతి ఇంట్లో మొక్క నాటాలి

విశాలాంధ్ర-కోరుకొండ : పర్యావరణ పరిరక్షణ స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర కార్యక్రమంలో కోరుకొండ గ్రామపంచాయతీలో గ్రీన్ ఆంధ్ర ప్రదేశ్ హరితాంధ్రప్రదేశ్ అనే కాన్సెప్ట్ ద్వారా ప్రతి ఇంట్లోనూ పచ్చదనం పెంపొందించడానికి కనీసం ఒక మొక్క నాటాలని సంకల్పంతో ఊరంతా ప్రజలను భాగస్వామ్యం చేసి పచ్చదనం పెంపొందింప చేసి దాని ద్వారా ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం గాలి ఆక్సిజన్ అందించటం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని గ్రామాన్ని సుందరమైన ఆహ్లాదకరమైన ప్రదేశంగా మార్చుకోవచ్చునని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి జీవవైవిధ్యం నెలకొల్పి ఆరోగ్య పరిరక్షణ పెంపొందించుకో వచ్చునని ప్రజల్లో అవగాహన కల్పించి అందరినీ భాగస్వాములు చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఎలక్ట్రానిక్ ప్లాస్టిక్ వ్యర్థాలను పంచాయతీకి అప్పగిస్తే వారికి స్వచ్ఛ రథం ద్వారా నిత్యవసర వస్తువులు పంపిణీ చేయుటకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. అశోక్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వర ప్రతాప్, గ్రామ సర్పంచ్ కర్రీ లక్ష్మీ సరోజ వీర గణేష్, గ్రామ కార్యదర్శి కె .రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

విశాలాంధ్ర - కడియం : స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కడియం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, డాక్టర్ గోరంట్ల రవి రాం కిరణ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోరంట్ల రవి రాం కిరణ్, ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామని, అందులో భాగంగా ఈనెల మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, కడియం పరపతి సంఘం అధ్యక్షులు వెలుగుబంటి నాని, మాధవరాయుడు పాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, మురమండ సహకార పరపతి సంఘం అధ్యక్షులు వట్టికుట్టి జానకి రామయ్య, తూర్పుగోదావరి జిల్లా జడ్పీఎన్ఎఫ్ అధికారి తాతారావు పాల్గొన్నారు.

గ్రామ పరిశుభ్రత మన బాధ్యత

విశాలాంధ్ర - సీతానగరం: మన గ్రామ పరిశుభ్రత మన బాధ్యత అంటూ చీపురుపల్లి గ్రామ పంచాయతీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వినూత్నంగా ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. దీనిలో భాగంగా స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా స్వచ్ఛ గ్రామం మనందరీ బాధ్యత అంటూ నినాదాలు చేస్తూ విద్యార్దులు ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో ప్లాస్టిక్ వాడకం నిషేధిదాం ప్రకృతిని కాపాడుదాం అంటూ ర్యాలీ చేశారు. ఉపాధ్యాయులు నాగేన్షా, గోపిశెట్టి బంగారాజు, సరితారాణి, ఇషాఖాన్, విద్యార్దులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందించాలి

విశాలాంధ్ర – సీతానగరం: ప్రక్కిలంక రైతులకు యూరియా అందించాలని కోరుతూ ఇనుగంటివారిపేట సర్పంచ్ సత్యం రాంపండు పోస్టల్ ద్వారా తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌కు, వ్యవసాయ మంత్రికి వినతి పత్రం సమర్పించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యం రాంపండు మట్లాడుతూ ఇనుగంటివారిపేట గ్రామమునకు చెందిన రైతులు ఎక్కువగా పొగాకు, మొక్కజొన్న తదితర పంటలు ప్రక్కిలంక గ్రామం తాళ్ళపూడి మండలంలో పొలములలో వ్యవసాయం చేస్తున్నారు.సదరు పొలములు గోదావరి అవతల అనగా అటు ఇటు గోదావరి మధ్యలో లంక పొలములు వున్నవి. పూర్వం లంక పొలములు అన్నీ పశ్చిమ గోదావరి జిల్లాలో ఉండేవి. రైతులందరూ సీతానగరం మండలానికి చెందిన వారు ప్రస్తుతం జిల్లాలు మార్పులో ప్రక్కిలంక గ్రామం తాళ్ళపూడి మండలం తూర్పు గోదావరి జిల్లాలోనే వచ్చి ఉన్నది, సుమారుగా ఒక వెయ్యి ఎకరములు సాగుచేస్తున్నారు. రైతులకు రెవెన్యూలో పట్టాదారు పాసు పుస్తకములు పొంది ఉన్నారు. కానీ ఆన్లైన్లో నమోదు లేనందున రైతులకు యూరియా అందుబాటులో దొరకక రైతులు ఆందోళన చెందుచున్నారు అని అన్నారు. తక్షణమే రైతులకు యూరియా అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది అని అన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

విశాలాంధ్ర-తాళ్లపూడి : వాతావరణ కాలుష్యాన్ని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ ఒక్కొక్క మొక్క నాటాలని తాళ్లపూడి ఎంపీడీఓ వేణుగోపాలరెడ్డి, ఎంపీపీ పోసిరాజులు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాల్లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని తాళ్లపూడి ఎన్ఆర్‌జీఎస్‌శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీపీ పోసిరాజు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్‌జీఎస్ ఏపిఓ సీ.ఎచ్. రమాదేవి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. తాడిపూడి గ్రామపంచాయతీ నందు స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా పంచాయితీ గ్రీన్ అంబాసిడర్‌కి వైద్య పరీక్షలు నిర్వహించారు. హెల్త్ కిట్స్ పంపిణీ చేశారు. ఎంపీపీ స్పెషల్ స్కూల్ నందు విద్యార్థిని విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ నవీన, ఎంఆర్పీ ప్రకాష్, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

విశాలాంధ్ర-దేవరపల్లి: గోపాలపురంఐ సిడి ఎస్ ప్రాజెక్ట్ పరిధిలో దేవరపల్లి మండలం దేవరపల్లి సెక్టార్లోని ఇందిరమ్మ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మహ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ఒక్కొక్క రోజుకు ఒక్కొక్క సబ్జెక్టు ప్రకారం జరుగుతుంది. దీని యొక్క ముఖ్య ఉద్దేశం తల్లి బిడ్డల్లో మెరుగైన ఆరోగ్యం పిల్లల ఎత్తు బరువు మెరుగుపరచటం పరిసరాల పరిశుభ్రత తీసుకునే ఆహారంపై అవగాహనను కల్పించడం. కుటుంబ సభ్యులను పురుషులను భాగస్వాములు చేసి తల్లి బిడ్డ సంక్షేమం మెరుగుపరచడం పై బాల్యవివాహాలు జరగకుండా అవగాహన కల్పించడం ఇటువంటి కార్యక్రమాలు నిరసిం చడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ విజయలక్ష్మి, అంగన్వాడీ టీచర్ సత్యవతి, కాంత కుమారి లక్ష్మి, ఓరుగంటి రాజు పాల్గొన్నారు

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర -కొవ్వూరు: వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణం పి ఎమ్ఎమ్ఎమ్ హై స్కూల్ నందు స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి కూటమి నాయకులు హాజరయ్యారు. ముందుగా కొవ్వూరుపురపాలక సంఘం కమిషనర్ గ్రంధి సందీప్ ప్రజా ప్రతినిధులు అధికారులు ప్రజలు విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. మెప్మా వారి ఆధ్వర్యంలో తడి పొడి చెత్త, వ్యర్థాలు నుండి సేంద్రీయ ఎరువుల తయారు చేసే విధానాన్ని తెలియజేశారు. అనంతరం శాసనసభ్యులు పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన సేంద్రియ ఎరువుల ప్రదేశాన్ని ప్రారంభించారు. కూటమి నాయకులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల పరిసరాలను కూటమి నాయకులు ప్రభుత్వ అధికారులతో కలిసి పరిశుభ్రం చేశారు. శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రత్నకుమారి,దిసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నగడ్డ సుబ్బారాయి చౌదరి, సురపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్ కుమార్, కొవ్వూరు పట్టణ అధ్యక్షులు దాయన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరశురాముడుకు సీపీఐ బృందం పరామర్శ

విశాలాంధ్ర - అమలాపురం : రిపబ్లికన్ పార్టీ జిల్లా నాయకులు పెయ్యల పరశురాముడు ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్నారు. సీపీఐ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ కే సత్తిబాబు డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా శ్రీనివాసరావు, బీకేఎంయు జిల్లా కమిటీ సభ్యులు సవరపు సత్యనారాయణలు వారి ఇంటికి వచ్చి పరామర్శించారు. ఈ సందర్భంలో గత ఉద్యమ అంశాలు నెమరు వేసు కున్నారు. దివంగత నేత బివి రమణయ్య, సరెళ రామారావు, కెవి రాఘవులు తో కలిసి వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలు భూస్వాములు దౌర్జన్యాలు ఎదిరించి పోరాడిన జ్ఞాపకాలు శ్రామిక వర్గం హక్కుల రక్షణ కోసం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి జరిపిన కృషి తాలుకు విషయాలు పరసు రాముడు చెప్పారు. తన వైద్య సందర్భంగా డాక్టర్లు, దళిత యువత అందించిన తోడ్పాటు మరువ లేనిదని పరుస రాముడు సత్తిబాబు బృందానికి సంభ్రమాశ్చర్యాలతో వివరించారు. పరశురాముడు ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని సీపీఐ బృందం తెలిపారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లా కేంద్ర గ్రంథాలయం, కాకినాడలో శనివారం Clove డెంటల్ క్లినిక్, వాసన్ ఐ కేర్,వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి (FAC) RCh వెంకట రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యదర్శి ప్రసంగిస్తూ జిల్లా కేంద్ర గ్రంథాలయం కాకినాడలో ఈ వైద్య శిబిరము ఏర్పాటు చేసినందుకు Clove డెంటల్ క్లినిక్, మరియు వాసన్ ఐ కేర్, డా మోహన్ డయాబెటిక్స్ వారు ముగ్గురు కలిపి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగినదని ఇందులో భాగంగా బీపీ, షుగర్, డెంటల్ మరియు కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు. గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు, సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డా. ఎ చైతన్య ప్రసంగిస్తూ ఈ వైద్య శిబిరంలో డెంటల్ సంబంధించిన పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, దంత సంరక్షణ గురించి పలు సూచనలు సలహాలు తెలియజేయడం జరిగినది. ప్రదీప్ మాట్లాడుతూ డయాబెటిక్ మరియు బీపీ సంబంధించిన పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అలాగే షుగర్ కంట్రోల్ తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు బ్లడ్ ప్రెజర్ గురించి పలు సూచనలు సలహాలు తెలియజేయడం జరిగినది. Clove డెంటల్ క్లినిక్, వీ సురేష్ మార్కెటింగ్ ఇన్ చార్జ్ వాసన్ ఐ కేర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సిబ్బంది నాగేంద్ర, మార్కెటింగ్ ఇన్‌చార్జ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కనీసం వేతనం ఇవ్వాలని ధర్నా

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ఆర్ఎలకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని కోరుతూ స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఉదయం వీఆర్ఎలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము అత్యంత తక్కువ జీతం రూ.10 వేలతో దినారాత్రాలు పని చేస్తున్నామని, ఈ రోజుల్లో దినసరి కూలీలకు వెయ్యిరూపాయలు కూలి ఇస్తున్నారని, తక్కువ జీతంతో తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈరోజుల్లో కరెంటు బిల్లే సుమారు రెండు వేల రూపాయలు వస్తుందని, ఇలాంటి పరిస్థితుల్లో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారు ప్రశ్నించారు. తాము పేరుకే ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నామని , కానీ తమ బతుకులు ధీనాతిదీనంగా ఉన్నాయన్నారు. 22న జిల్లాలోని వీఆర్ఎలు అందరం కలిసి తమ డిమాండ్లకు సంబంధించిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు ఎం.రమణ, జిల్లా సెక్రెటరి ర్యాలి సుబ్బారావు, డివిజన్ అధ్యక్షులు కె. రాజేంద్రప్రసాద్, డివిజన్ సెక్రెటరి ఎం. దుర్గారావు, కోరుకొండ మండలం అధ్యక్షుడు కె. కన్నబాబు, అనపర్తి మండలం అధ్యక్షుడు రామారావు, రంగంపేట మండలం అధ్యక్షుడు ఎల్. సుబ్బారావు,బిక్కవోలు మండల అధ్యక్షుడు పాల్గొన్నారు.

వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలు



విశాలాంధ్ర - అమలాపురం : దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమలాపురం మెయిన్ రోడ్‌లో వేంచేసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో ఈనెల 22 నుంచి వచ్చే నెల 2 వరకు దసరా మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు శనివారం ఉదయం వాసవి ఫంక్షన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో తెలియజేశారు. వివిధ కార్యక్రమాలలో భాగంగా 22 సోమవారం ఉదయం అమ్మవారిని వెండి పల్లకిలో ఊరేగింపుగా 108 కలశలతో ఆర్యవైశ్య మహిళలచే అభిషేకజలంతో అమ్మవారి ఆలయమునకు వచ్చి ఉత్సవ మూర్తికి అభిషేకం చేయనున్నట్లు ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటలకు లలితా పారాయణం 24 ఉదయం భగవద్గీత పారాయణం. 25 102 మంది కన్య పిల్లలచే కలశ పూజ. తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈనెల 26 శుక్రవారం రూ. 3 కోట్ల పైబడి కొత్త కరెన్సీ నోట్లతో శ్రీ మహాలక్ష్మి అమ్మవారిగా దర్శనం ఇవ్వనున్నట్లు భక్తులందరూ అమ్మవారిని దర్శించి తరించవలసిందిగా వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు యెందూరు వేంకట్రామయ్య, అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరు నరేష్, కోశాధికారి కొమ్మూరి ప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన వీరన్న, కో చైర్మన్లు పచ్చిగోళ్ళ సోమరాజు, నూలు శ్రీనివాసు, సంఘ ముఖ్య సలహాదారులు వంకాయల కాశీ, యెందూరి నాగేశ్వరరావు, వరదా సూరిబాబు, సలహా నూలు కృష్ణ, పీఆర్ఓ కాళ్ళకూరి బుజ్జి, లీగల్ సెల్ సలహాదారు నంబూరి మూర్తి, అదనపు కార్యదర్శి కాళ్ళకూరి కుమార్, అదనపు కోశాధికారి యర్రమిల్లి సత్తిబాబు, కార్తీక సమారాధన కమిటీ చైర్మన్ సింగంశెట్టి కుమార్ తదితరులు తెలియజేశారు.

శ్రీ చైతన్యలో ముందస్తు దసరా ఉత్సవాలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం ముందస్తు దసరా ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వినూత్న మాట్లాడుతూ దసరా అంటే విజయం సాధించడమన్నారు. ఈ లోకానికి స్త్రీ యొక్క గొప్పతనాన్ని ఆమె యొక్క శక్తిని తెలపటానికి ఈ దసరా ఉత్సవాలు దోహదపడతాయన్నారు. దసరా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం పార్థసారథి, అకాడమిక్ కోఆర్డినేటర్ రామారావు, ప్రైమరీ జోనల్ ఇన్ఛార్జి కవిత రాజేశ్వరి, జోనల్ ఇన్ఛార్జ్ షమ్మీ బేగం, విద్యార్థులు పాల్గొన్నారు .

అడపా హరిపై కడియాల విమర్శలు

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : అడపా హరి అధ్యక్షుడుగా ఉన్న సువర్ణ వర్తక సంఘం నెంబరు 420 అని, అడపా హరి డబుల్ 420 అని,ఫేక్ అధ్యక్షుడు అని శ్రీ సువర్ణ వర్తక సంఘం అధ్యక్షుడు కడియాల శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం నల్లమందు సందులోని రాజేశ్వరి జ్యువెల్లరీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిన్నగాక మొన్న వచ్చిన అడపా తనను సువర్ణ వర్తక సంఘం నుంచి బహిష్కరణ చేయడానికి అతని జీవితకాలం సరిపోదని మండిపడ్డారు. తాను ఎన్నికల్లో గెలిచిన అధ్యక్షుడినని, ఆతకి మాదిరి అధ్యక్షుడుగా ప్రకటించుకున్నవాడిని కానని ఆయన విమర్శించారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ఎంపీ మార్గాని భరత్ పక్కన చేరి ఎన్నో అవకతవకలకు పాల్పడిన అడపా హరి ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పక్కన చేరి పబ్బం గడుపుకుంటున్నాడని మండిపడ్డారు. అవినీతికి, అవకతవకలకు పాల్పడిన అడపా రక్తం మరిగిన పులిలా ఇప్పుడు ఈ సంఘాన్ని వదలడని ఆయన ఆరోపించారు. సువర్ణవర్తక సంఘంలోకి కులాన్ని, పార్టీలను ఎందుకుతీసుకు రావాలని ఆయన నిలదీశారు. సువర్ణ వర్తక సంఘ సభ్యులకు బంగారం క్రయ విక్రయాల్లో ఏదైనా ఇబందులు వస్తే అడపా హరి పరిష్కరించలేదని, పోలీసులు వస్తే ఎలా మాట్లాడాలో తెలియదని తీసిపాడేశారు. పోరాటం చేసి తాను సంఘాన్ని ముందుకు నడిపిస్తానని కడియాల శ్రీనివాస్ అన్నారు. వైసీపీ హయాంలో రాజమండ్రిని భ్రష్టు పట్టించిన అడపా హరి ఇప్పుడు సువర్ణ వర్తక సంఘాన్ని భ్రష్టు పట్టిస్తున్నాడని ఆయన ఆరోపించారు.సమావేశంలో కడియాల వరబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర - కొవ్వూరు : నూలు కళ్యాణమండపం ప్రాంగణంలో శనివారం నూలు ట్రస్ట్ సభ్యులు స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు. అనంతరం నూలు సత్రం చైర్మన్ నాళం వీర వెంకట శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా వుంచాల న్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్ సుబ్బారావు, ఈవో బాలకృష్ణ సిహెచ్ వి లక్ష్మి , ట్రస్ట్ సభ్యులు అంజి బాబు, విజయ భాస్కర్, కె నవ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి :ఎమ్మెల్యే

విశాలాంధ్ర - జగ్గంపేట : పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేమని వారు లేనిదే ప్రజారోగ్యం లేదని, కొవిడ్ సమయంలో ప్రాణాలను లెక్కచేయక విధులు నిర్వర్తించిన తీరు మరువలేనిదని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం రాజమండ్రి రోడ్‌లోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ ఆవరణలో జగ్గంపేట మండలంలో 102 మంది పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఘన సన్మానం, మెడికల్ కిట్లు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే నెహ్రూ శానిటేషన్ కిట్లుతో పాటు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా స్టీల్ వాటర్ బాటిల్ అందజేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. జగ్గంపేట మండలం ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పారిశుధ్య కార్మికులకు మనోధైర్యం కల్పించేలా వారికి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించి వారిని ఘనంగా సత్కరించి వారికి శానిటేషన్ కిట్లు పంపిణీ చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం తీసుకున్నామన్నారు. అదేవిధంగా ప్రతి పంచాయతీలను పారిశుధ్య కార్మికుల జీతాలు పెంచి అందించాలని సెక్రెటరీ ఆదేశించారు. దీనికి కావాల్సిన పర్మిషన్లు నేను తీసుకొస్తాను. ఈ కార్యక్రమంలో ఎస్‌వివిఎస్ అప్పలరాజు, అడపా భరత్, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్తకొండ బాబు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ ప్రణీత్, అడబాల వెంకటేశ్వరరావు, పైడిపాల సూరిబాబు, బుర్రి సత్తిబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ పాండ్రంగి రాంబాబు, లక్కిరెడ్డి సూర్యావతి, బస్వా చినబాబు, రేఖ బుల్లి రాజు, ఉప్పలపాటి బుల్లెబ్బు, మండపాక అప్పన్న దొర, రాయి సాయి, సర్వసిద్ధి లక్ష్మణరావు పాల్గొన్నారు.

బాబికి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - తాళ్లరేవు : కాకినాడ జిల్లా, తాళ్ళరేవు మండలం తాళ్ళరేవు టీడీపీ మండల అధ్యక్షుడిగా భాధ్యతలు చేపట్టిన ధూళిపూడి వెంకటరమణ (బాబి)ను శనివారం తన స్వగృహం పి మల్లవరంలో మర్యాదపూర్వకంగా కలిసి సుంకర పాలెం కూటమి నాయకులు. శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సుంకర పాలెం గ్రామంలో పలు సమస్యలపై పరిష్కార దిశగా తనవంతు సహాయసహకారాలు అందించాలని కూటమి నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గుంటముక్కల సూరిబాబు, సర్పంచ్ టిళ్ళపూడి నాగేశ్వరరావు, సుంకర రామచంద్రరావు, పెద్దిరెడ్డి రవికుమార్, తాతపూడి నాగేశ్వరరావు, చీకట్ల నాగేశ్వరరావు, కొమ్మిరెడ్డి బద్రి, గుంటముక్కల విష్ణు, మర్రి అశోక్ పాల్గొన్నారు.

చలో అసెంబ్లీ ముట్టడికి
కౌలు రైతు సంఘం పిలుపు

విశాలాంధ్ర - కరప : ఈనెల 22న విజయవాడ నుంచి అమరావతి అసెంబ్లీకి కౌలు రైతులతో వెళ్లి ధర్నా నిర్వహించడం జరుగుతుందని జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, వి రాజాబాబు తెలిపారు. కరప మండలంలో కౌలు రైతులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. అన్నదాత సుఖీభవ ద్వారా కౌలు రైతులకు రూ.20వేలు అందించాలని కోరారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి ఈ నెల 22న విజయవాడ వెళుతున్నామన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ

విశాలాంధ్ర - కరప : స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో శనివారం బూత్ లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించుట జరిగిందని, మండల రెవెన్యూ అధికారి టి దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఆర్టీవో మల్లిబాబు, ముఖ్య అతిథిగా పాల్గొని బీఎల్‌ఓలకు ఓటు నమోదు కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించారు. ఓటరు లిస్టులు తప్పులు లేకుండా తయారు చేయాలని, డెత్ ఓటర్లను తొలగించాలని, డోర్ టు డోర్ వెళ్లి ఓటర్ లిస్ట్‌లో ఉన్న వ్యక్తులు చిరునామా కరెక్షన్ చేయవలసిందిగా తెలిపారు. ఇన్చార్జ్ ఎంపీడీవో సలాది శ్రీనివాసరావు, ఏవో సత్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు

విశాలాంధ్ర - కరప : కరప మండలం వేలంగి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని గ్రామ సర్పంచ్ నీలిమ రాజేష్ ఏర్పాటు చేయగా, డాక్టర్ కాకర రామస్వరూప్ జవహర్ ఆవిష్కరణ చేశారని సర్పంచ్ నీలిమ రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెర్ల వీరయ్య చౌదరి, బోండా వెంకన్నరావు, పాకచంద్రరావు, ఎంఈఓ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ కమిటీ తనిఖీలు

విశాలాంధ్ర - పెద్దాపురం : మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతులు పాఠశాలలో శనివారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ బృందం ఎంఎల్ఎస్ కమిటీ చైర్మన్ ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీ జరిపింది. విభిన్న ప్రతిభావంతులకు అందుతున్న సేవలపై ప్యానెల్ లాయర్ అత్తిలి ప్రభుజీ, పారా లీగల్ వాలంటీర్లు నూతలపాటి అప్పలకొండ, బివిఎస్ఎన్ మూర్తి, కుంచే నానిబాబు, లక్ష్మి బృందం ఆరా తీసింది. శాంతివర్ధన సంస్థ విద్యార్థులకు అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా న్యాయవాది ప్రభుజీ, నూతలపాటి అప్పలకొండ మాట్లాడుతూ జిల్లాలోనే మంచి సేవలందిస్తున్న సంస్థ శాంతివర్ధన అన్నారు. ఎన్నిసార్లు తనిఖీకి వచ్చిన ఇక్కడ అందుతున్న సేవలకు పేరు పెట్టే పరిస్థితి ఉండదని. సంస్థ యాజమాన్యం వీరబాబు, సత్య దంపతులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం దివిలి ఎస్సీ, బీసీ హాస్టల్స్ను తనిఖీ చేసి అక్కడ అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు లక్ష్మి, భాస్కరరావు తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రత

విశాలాంధ్ర - కాకినాడ : స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు, డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి, వికాస పీడీ కె లచ్చారావు ఇతర సిబ్బందితో కలిసి స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని పరిసరాలు శుభ్రం చేశారు. గ్రీన్ ఏపీ కార్యక్రమం కింద మొక్కను నాటి, అందరిచేత స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీఆర్వో వెంకటరావు మాట్లాడుతూ ప్రతి నెల 3వ శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ పిలుపు మేరకు కాకినాడ జిల్లా అంతటా స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరు తమ పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకోవాలి ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ఎస్ రామ్మోహన్ రావు, వివిధ విభాగాల అధిపతులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్య, క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని బాలయోగి గురుకుల పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడా విభాగాలలో నైపుణ్యాలను సంపాదిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర శారద అన్నారు. ఈ మేరకు జగ్గంపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూడో పోటీలలో అండర్ 19 విభాగంలో ఏలేశ్వరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులు డి కీర్తన, జె సాయి లావణ్య, వై రమ్యలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చంద్రశారదతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల అధ్యాపకుల బృందం పాల్గొని చిన్నారులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ చంద్ర శారద మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న చిన్నారులందరూ విద్యతోపాటు క్రీడల్లో కూడా విశేషంగా రాణిస్తున్నారని తద్వారా పాఠశాలకు కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు వస్తున్నాయని వారిని అభినందించారు. ఏలేశ్వరం గురుకుల పాఠశాల గ్రామస్థాయి నుండి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తున్న క్రీడలలో విద్యార్థులు పాల్గొని మంచి కీర్తిని తెస్తున్నారని ఆమె సంతోషంతో కూడిన ఆనందాన్ని వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటి వాటిని పెంచే బాధ్యత కూడా తీసుకుని పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతలో భాగంగా విద్యార్థులు వ్యవహరిస్తున్నారని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. విద్యార్థులు తమ పాఠశాలలో చేస్తున్న కృషి వారి జీవితాలలో బంగారు బాటవుతుందని ప్రిన్సిపల్ చంద్ర శారద అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి :ఎమ్మెల్యే చినరాజప్ప

విశాలాంధ్ర - సామర్లకోట : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. సామర్లకోట పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం సామర్లకోట గాంధీనగర్‌లో సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య ఆధ్వర్యంలో జరిగిన 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానానికి స్వచ్ఛత అత్యంత ముఖ్యమన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ముందు చూపుతో అన్ని పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలని, ప్లాస్టిక్ రహిత సమాజం కావాలని, ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని, కాయగూరలు పెంచి మంచి ఆరోగ్య ప్రయోజనాలు కలిగిన ఆహారాన్ని తినాలని ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే చినరాజప్ప పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, అందుగుల జార్జి చక్రవర్తి, బలుసు వాసు, గోలి దొరబాబు, తదితర కూటమి పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్య భవిష్యత్‌కు పునాది

విశాలాంధ్ర - కొత్తపేట : విద్యార్థులు ఉన్నత విద్యలను అభ్యసించి భవిష్యత్తుకు మంచి పునాదులు వేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం భాష సూచించారు. చప్పిడి వారి పాలెం జడ్పీహెచ్ఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్వచ్ఛత పక్వాడ్‌లో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. మొక్కలను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని విద్యార్థులకు ఉద్బోధించారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల క్లాసులు సందర్శించి నోట్ బుక్స్, మార్కుల వివరాలను పరిశీలించి బాగా చదివి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి భవిష్యత్తుకు మంచి పునాది వేసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె అరుణశ్రీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్ఏలు నిరసన

విశాలాంధ్ర - కొత్తపేట : తమ సమస్యలను పరిష్కరించాలంటూ వీఆర్ఏలు కొత్తపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. శనివారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డివిజన్ అధ్యక్షులు ఆంజనేయులు ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ వీఆర్ఏలకు పేస్కేల్ వర్తింపజేయాలని అర్హత కలిగిన వీఆర్ఏలను వీఆర్వోలుగా ప్రమోషన్ ఇవ్వాలని నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియమించాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీఓ శ్రీకర్‌కు అందజేశారు. ఈనెల 22న అమలాపురం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. డివిజన్ సెక్రెటరీ బివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోత నివారణకు త్వరలో శాశ్వత పరిష్కారం : ఎంపీ

విశాలాంధ్ర - కాకినాడ : సముద్ర అలల కారణంగా కోతకు గురవుతున్న ఉప్పాడ తీర ప్రాంతానికి త్వరలో శాశ్వత పరిష్కారం లభించనుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇదే అంశం పై పలుమార్లు కేంద్ర హోం శాఖ ప్రతినిధులను వ్యక్తిగతంగా కలిసి అభ్యర్థించడంతో పాటు గడచిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో లోక్ సభలో ప్రశ్నించడంతో శుక్రవారం కేంద్రం నుండి లిఖిత పూర్వక సమాధానం వచ్చిందని తెలిపారు. ప్రాజెక్ట్ సాధ్య సాధ్యాలపై చర్చించేందుకు నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ (ఎన్డీఎంఏ) రెండుసార్లు సమావేశాలు నిర్వహించి, టెక్నికల్ కమిటీ సూచనలతో ఎట్టకేలకు కాకినాడ తీరంలో రూ.323 కోట్ల వ్యయంతో రక్షణ గోడ నిర్మించేందుకు ఆమోదం తెలిపిందని, ప్రాజెక్టు తుది ఆమోదం కోసం ప్రతిపాదనలను నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ కేంద్ర హోం శాఖకు పంపినట్లు తెలిపారు. దీంతో శనివారం కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్ షాకు లేఖ రాసి క్షేత్రస్థాయిలో లభించినందున త్వరితగతిన ప్రాజెక్టును ఆమోదించాలని కోరినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

స్వచ్ఛంద్రా లక్ష్యం దిశగా పయనిద్దాం : ఆర్డీవో

విశాలాంధ్ర – పెద్దాపురం : రాష్ట్రం స్వచ్ఛంద్రా లక్ష్యంగా పయనించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయ్యాలని పెద్దాపురం ఆర్డీఓ కె శ్రీరమణి అన్నారు. స్వర్ణాంధ్ర. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో పరిసరాలను పరిశుభ్రం చేసి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆమె శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఆర్డీఓ శ్రీరమణి మాట్లాడుతూ స్వచ్ఛ –ఆంధ్ర లక్ష్యాలను సాధించడానికి ప్రతీ ఒక్కరుపూ కృషి చేయ్యాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఆర్డీవో అన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్. సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీల్లో రెచ్చగొట్టే వాఖ్యలు ఉంటే కఠిన చర్యలు

విశాలాంధ్ర – మండపేట : రూరల్ మండలంలోని ఫ్లెక్స్ ప్రింటింగ్ వ్యాపారులు ఫ్లెక్సీలు ముద్రించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రూరల్ సీఐ పి దొరరాజు సూచించారు. శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో ఫ్లెక్స్ ప్రింటింగ్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఫ్లెక్స్ ప్రింటింగ్ సమయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన చెప్పారు. ఫ్లెక్సీల్లో వివిధ వర్గాలు, మతాలు, రాజకీయ నాయకులపై ప్రేరేపించేలా, అనుచితంగా వాక్యాలు ముద్రిస్తే శాంతి భద్రతలకు భంగం కలిగిస్తుందని, అటువంటి సందర్భాల్లో చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి ప్రింటింగ్ చేయమని ఒత్తిడి చేసే వారి వివరాలను వెంటనే పోలీస్ స్టేషన్లో తెలియజేయాలని వ్యాపారులకు సూచించారు. ఫ్లెక్సీలపై ప్రింటింగ్ చేసిన వారి వివరాలు కూడా తప్పనిసరిగా ముద్రించాలని యజమానులకు ఆదేశించారు.

హైకోర్టు జడ్జిని కలసిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర – రాజమండ్రి సిటీ : జిల్లాకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి ఎన్. జయసూర్యను రాజ మహేంద్రవరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్లో శనివారం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహా కిషోర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఎస్ పి ఆయనకు పూల మొక్క బహూకరించి శు భాకాంక్షలు తెలిపారు.

ఘనంగా నిమ్మకాయల సంస్మరణ సభ

హాజరైన నాయకులు

విశాలాంధ్ర – అమలాపురం : ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దివంగత కామ్రేడ్ నిమ్మకాయల శ్రీనివాసరావు సంస్మరణ (ఆదరణ కూడిక) కార్యక్రమం క్రీస్తు సంఘ కాపరుల నేతృత్వంలో 27వ వార్డులో శ్రీనివాసరావు నివాస గృహంవద్ద వారి కుమారులు ముగ్గురు ఘనంగా జరిపారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూని యన్ నాయకులు, కార్యకర్తలు బంధువులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎఐటీయూసీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ కె సత్తిబాబు, రెల్లి సంఘం రాష్ట్ర నాయకులు బొచ్చా నరసింహమూర్తి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల బాబి, సీపీఐ అమలాపురం నియోజకవర్గ కార్యదర్శి గూడాల వెంకటరమణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి శీలం వెంకటేష్, ముమ్మిడివరం పారిశుద్ధ్య సంఘం నాయకులు వనచర్ల విజయకుమార్లు నేతృత్వం వహించారని నిమ్మకాయల కళ్యాణ్ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర – రాజమహేంద్రవరం రూరల్ : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నిర్వహిస్తున్న రండి టీ త్రాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం శనివారం కొంతమూరు సచివాలయంలో జరిగింది. ఈ కార్యక్రమం రాజమండ్రి రూరల్ తాలూకా యూనిట్ అధ్యక్షుడు ఎన్విఎస్ రాజు అధ్యక్షతన జరుగింది. జిల్లా కార్యదర్శి సి హెచ్ఎస్ విల్సన్ పాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన 30వేల కోట్ల బకాయిలను ప్రతి ఉద్యోగికి ఏ ఉద్యోగికి ఎంత బకాయి ఉందో సంబంధిత డ్రాయింగ్ అధికారుల ద్వారా సర్వీస్ రిజిస్టర్లో నమోదు చేయాలని, ఆ బకాయిలకు తగినట్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేసారు. ఉద్యోగులకు వెంటనే మధ్యంతర భృతి చెల్లించాలని, రిటైర్డ్ న్యాయమూర్తి లేదా సిట్టింగ్ న్యాయమూర్తి ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసి పిఆర్సి అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఈ మూడు అంశాలపై సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కెఆర్ సూర్యనారాయణ మాట్లాడిన వీడియోలను ప్రదర్శించి, ఉద్యోగులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో తాలూకా కార్యదర్శి పి మురళి కృష్ణ, ట్రెజరర్ వై శాంతిరాజు, సంయుక్త కార్యదర్శి శంకరరావు, పంచాయతీ కార్యదర్శి డి శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కుంటుబడిన విద్య : శివ

విశాలాంధ్ర – కుక్కునూరు : నాలుగు నెలలుగా టీచర్ల కొరత వేధిస్తుండంతో కుక్కునూరు మండలంలోని విద్యార్థులకు విద్య కుంటుపడిందని ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు డి.శివ పేర్కొన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సారంగి శౌర్య అధ్యక్షతన జరిగిన విదార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తుండంతో విద్యార్థులకు విద్య అందని ద్రాక్షలా మారిందని తెలిపారు. మండలంలోని అనేక పాఠశాలల్లో టీచర్ల పోస్టులను భర్తీ చేయకపోవడంతో విద్యార్థుల విద్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా ఉందన్నారు. ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థుల నియామక ప్రక్రియ చేపట్టిన నేపథ్యంలో ముందుగా ఏజెన్సీ ప్రాంతమైన కుక్కునూరు మండలంలో ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా ఇక్కడికి టీచర్ల కొరత భర్తీ చేశాకే ఇతర ప్రాంతాలకు ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు. డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం వెబ్ ఆప్షన్ కల్పించడంతో వారు ఇతర ప్రాంతాలకు సెలెక్ట్ చేసుకునే అవకాశం ఉందని అలా జరిగితే మరలా కుక్కునూరు మండల విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. నాలుగు నెలలుగా పాఠశాలల్లో సరిపడా టీచర్లు లేక విద్యార్థులకు బోధన లేదని దీనిపై విద్యార్థులు,వారి తల్లిదండ్రులు,పలు పార్టీల నాయకులు ఇటీవల నిరాహార దీక్షలు చేసినా ప్రభుత్వానికి ఏ మాత్రం పట్టడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం,విద్యా శాఖ దృష్టి పెట్టి టీచర్ల పోస్టులను భర్తీ చేసి,విద్యార్థులకు విద్య అందించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కారం దారయ్య, కుక్కునూరు మండల సమితి కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, జిల్లా సమితి సభ్యులు ఐతా సురేష్ బాబు, కాంతి చైతన్య, ముజాఇత్, సాయికుమార్, ప్రేమ చరణ్, బన్నీ, లక్కీ, మణికంఠ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య పరికరాలు

విశాలాంధ్ర ప్రతినిధి – ఏలూరు: అర కొర సౌకర్యాలు, వైద్య పరికరాల కొరతతో ఇబ్బంది పడుతున్న ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి కొంత స్వాంతన చేకూరనుంది. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చొరవతో రూ. కోటి విలువైన వైద్య పరికరాలు సమకూరాయి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద గెయిల్ ఇండియా ద్వారా కోటి రూపాయల విలువైన వైద్య పరికరాలు అందాయి. ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన అనస్థీషియా వర్క్ స్టేషన్ పరికరాలు, కార్డియోటోకోగ్రఫీ మెషిన్లు, కంప్యూటెడ్ రేడియోగ్రఫీ సిస్టమ్ (ఎక్స్‌రే క్యాసెట్ రీడర్), హెమటాలజీ అనలైజర్ (ఓపెన్ లూప్), హెమటాలజీ అనలైజర్ (ఓపెన్ లూప్), ఐసీఈ లైన్డ్ రిఫ్రిజిరేటర్లు కోరుతూ ఈ ఏడాది మార్చిలో గెయిల్ ఇండియా కు ఆసుపత్రి సూపరింటెండెంట్ పేరుతో లేఖ రాశారు. సీఎస్ఆర్ కింద నిధులు కేటాయించి ఈ వైద్య పరికరాలు ఏర్పాటు చేయాల్సిందిగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోరడంతో గెయిల్ ఇండియా సానుకూలంగా స్పందించి నిధులు కేటాయించింది. శు క్రవారం రాత్రి వైద్య పరికరాలు ఆసుపత్రికి చేరాయి. వాటిని కొద్దిరోజుల్లోనే రోగులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆసుపత్రి వర్గాలు తెలియచేశాయి. దీనిపై హర్షం వ్యక్తం చేసిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఆసుపత్రి అభివృద్ధికి తాను శాయశక్తులా కృషి చేస్తానని, భవిష్యత్తులో మరిన్ని వసతుల కల్పనకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.

మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం : ఎస్పీ

విశాలాంధ్ర ప్రతినిధి–ఏలూరు : జిల్లాలో గంజాయి ఇతర మత్తు పదార్థాలు రవాణా చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొని మత్తు పదార్థాల రవాణాను అరికట్టడానికి ఉక్కుపాదం మోపాలని ఏలూరు జిల్లా ఎస్పీ కే ప్రతాప్ శివ కిషోర్ ఆదేశించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగించే వ్యక్తులను ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. శనివారం ఏలూరులోని పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం సబ్ డివిజన్ల పరిధిలోని సర్కిల్ లెవెల్, పోలీస్ స్టేషన్ అధికారులు పాల్గొన్నారు. ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణ, ప్రజా భద్రత, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిర్మూలనపై పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గ్రామ సభలు, అవగాహన సమావేశాలు నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. యువతతో సమావేశమై సైబర్ నేరాలు, లోన్ యాప్స్ మోసాలపై అవగాహన కల్పించాలన్నారు. షాపులు, వాణిజ్య ప్రాంగణాలు, రద్దీ ప్రాంతాల్లో సీసీ.కెమెరాలు తప్పని సరిగా ఏర్పాటు చేయించాలని సూచించారు. డ్రోన్లను వినియోగించి మారుమూల ప్రాంతాలలో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు ఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు, ఎస్‌బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వ రరావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ హబీబ్ భాషా, డీఎస్పీలు, సబ్ డివిజన్ అధికారులు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

విశాలాంధ్ర – కాకినాడ రూరల్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ మరియు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పర్యవేక్షణలో హైరిస్క్ ఏరియాలో లైంగిక ఆరోగ్యం పట్ల అవగాహన నిగ్రహ శక్తి ఏ విధంగా పెంపొందించుకోవాలో అనే అంశాలపై అవగా హన కార్యక్రమం జరిగింది. శనివారం గైగాలపాడు గ్రామ సచివాలయంలో చేంజెస్ కమ్యూనిటీ హెల్త్ అవేర్నెస్ అండ్ నేచరల్ గ్రీన్ ఎన్విరానమెంట్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పుష్ప కుమారి పర్యవేక్షణలో చేంజెస్ ప్రాజెక్టు మేనేజర్ డి దుర్గ భవాని ఆధ్వర్యంలో ఈ క్యాంపెయిన్ ఏర్పాటు చెయ్యడం జరిగింది. హెచ్ఐవి, ఎయిడ్స్ పై "ఇంటెన్సిఫైడ్ ఐఈసీ అవేర్నెస్ క్యాంపెయిన్ 2025" కార్యక్రమ ఆవశ్యకతను వివరించారు. ప్రాజెక్టు మేనేజర్ దుర్గా భవాని హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది? ఎలా వ్యాపించదు, హెచ్ఐవి, ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనేఅంశంపై వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిడిపిఓ వై లక్ష్మి మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్క మహిళ పాత్ర ఎంతైనా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేంజెస్ కమ్యూనిటీ సభ్యులు, సచివాలయం సిబ్బంది, పండూరు పిహెచ్‌సి సిబ్బంది ఆదినారాయణ, ఏఎన్ఎంలు, ఆశవర్కర్స్, చేంజెస్ సిబ్బంది సరోజ పాల్గొన్నారు.

స్వస్థ్ నారీ- ససక్తీ పరివార్ అభియాన్

విశాలాంధ్ర – తాళ్లరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి మల్లవరం పంచాయతీ సచివాలయం 2 పరిధిలోని పత్తిగొందిలో శనివారం స్వస్థ్ నారీ ససక్తీ పరివార్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న తాళ్ళరేవు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ (బాబి). ఈ సందర్భంగా బాబి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం శక్తి వంతంగా ఉంటుందన్నారు. అంగన్వాడీ సిబ్బందిచే పౌష్టికాహారంపై అవగాహన కలిగించే స్టాల్ ఏర్పాటు చేశారు.డాక్టర్ శ్యామల, రంజన్, ఏఎన్ఎం దుర్గ, భవానీ, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, సర్పంచ్ పంపన రామకృష్ణ పాల్గొన్నారు.